క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 31న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కుమార్పల్లి, పాలజెండా, బుద్ధభవన్ ప్రాంతాల్లో ఉదయం 9.30గంటల నుంచి 10.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో స్టాల్ ఏర్పాటు



హన్మకొండ అర్బన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలో సోమవారం స్టాల్‌ను ఏర్పాటు చేశారు. మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల ప్రతినిధులు తయారు చేసిన కాటన్ దుస్తులు, పచ్చళ్లు, కాటన్ బ్యాగుల విక్రయానికి ఈ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. స్టాల్‌ను డీఆర్‌ఓ వైవీ.గణేష్, జెడ్పీ సీఈఓ విద్యాలత, అధికారులు సందర్శించారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు రజిత, రాణి పాల్గొన్నారు.

ఏజేమిల్లు కార్మికులకు నివాస స్థలాలు కేటాయించాలి



వరంగల్ చౌరస్తా: ఆజంజాహి మిల్లు కార్మికులకు నివాస స్థలాలు కేటాయించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వరంగల్ అబ్బనికుంటలోని రైతుభవన్‌లో సోమ రామ్మూర్తి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో వివిధ సంఘాల నాయకులు గోధుమల కుమారస్వామి, గడ్డం సదానందం, డాక్టర్ అనిక్ సిద్దిఖీ, సోమిడి శ్రీనివాస్, తదితరులు పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు తలమాణికంగా ఉన్నా ఏజే మిల్లును ఖాయిలా పడేసి అమ్ముకోవడం దారుణమని విమర్శించారు. అనంతరం వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు వివరించారు.

సీఎం కప్ జూడో పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



మడికొండ: సీఎం కప్ జూడో పోటీల్లో మడికొండ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు రాణించారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు తెలంగాణ స్టేట్ మీట్ కరీంనగర్‌లో నిర్వహించిన పోటీల్లో పాఠశాల నుంచి 24 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 12 మంది ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్, జిల్లా కోఆర్డినేటర్ దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. అక్షిత, బంగారు పతకం సాధించగా, హిమవర్ధిని, డీ.కీర్తి, సీహెచ్.చరిష్మ, బి.స్పందన, వి.కావ్య (వెండి పతకాలు) కే.కృప, వి.సాయిప్రీతి, పి.సాయిరష్మిత, కే.సహజ, జీ.శ్రీజ, బి.నక్షత్ర కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. క్రీడాకారులతో పాటు జూడో శిక్షకుడు నాగరాజు, పీడీలు పద్మ, జే.సరిత, పీఈటీలను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు కళాశాల ప్రాంగణంలో అభినందించారు.

సభ్యుల సంక్షేమానికి దోహదం



ఖిలా వరంగల్: సభ్యుల సంక్షేమానికి పరపతి సంఘాలు ఎంతగానో దోహదపడుతున్నాయని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే సంఘాలు మరింత ఆర్థిక శక్తిగా ఎదుగుతాయని కరీమాబాద్ మున్నూరు కాపు పరపతి సంఘం గౌరవ అధ్యక్షుడు కోల కుమారస్వామి, అధ్యక్షుడు చింతపట్ల మురళి అన్నారు. వరంగల్ 39వ డివిజన్ కరీమాబాద్‌లోని లక్ష్మీనగర్‌లో సంఘ ప్రధాన కార్యదర్శి దద్దనాల రమేష్ అధ్యక్షతన మున్నూరు కాపు పరపతి సంఘం 10వ మహాసభ సోమవారం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ ప్రతీ సభ్యుడికి వ్యక్తిగత ఆరోగ్య భద్రతతోపాటు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అతి తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం సంఘ కోశాధికారి నేల్ల రాజు.. సంఘ వార్షిక ఆదాయ, వ్యయాలను సభ్యుల ముందు ప్రవేశపెట్టగా వారు ఏకగ్రీవంగా ఆమోదించారు. కార్యక్రమంలో ప్రహ్లాద్, రాజేష్, రవికుమార్, హరికృష్ణ, అరుణ్ పాల్గొన్నారు.

ఏఐసీటీయూ కరపత్రాల ఆవిష్కరణ

ఖిలా వరంగల్: జనవరి 5న కేసముద్రంలో జరగనున్న ఏఐసీటీయూ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఖిలా వరంగల్ తూర్పు కోటలో సోమవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్ర ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు జగదీశ్వర్ హాజరై మాట్లాడారు. నాయకులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇట్టినేని సూరయ్య, నాగేష్, మల్లికార్జున్, నరసయ్య, ఐలయ్య, నరహరి పాల్గొన్నారు.

భారీ వాహనాలతో ప్రమాదాలు

- ఇరుకుగా మడికొండ – ధర్మసాగర్ రోడ్డు



మడికొండలో ఇరుక్కుపోయిన లారీ (ఫైల్)

మడికొండ: మడికొండ – ధర్మసాగర్ రోడ్డుపై తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మడికొండ మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరుకుగా ఉన్న రోడ్డుపై లారీలు, టిప్పర్లు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో స్థానికులతో పాటు వాహనదారులు, ప్రయాణికులు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడే రెండుమూడు రోజులు మడికొండ లోపలికి భారీ వాహనాలు రాకుండా పోలీసులు చూస్తున్నారు. ఆ తర్వాత యధావిధిగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గత మంగళవారం ఉదయం మడికొండ చౌరస్తా నుంచి గ్రామంలోకి లారీ వెళ్తుండగా ధర్మసాగర్ నుంచి మడికొండ వైపునకు ట్రాక్టర్ వస్తుండగా ఆ రెండు వాహనాలు ఇరుకు రోడ్డుపై ఇరుక్కుపోయాయి, దాంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల మడికొండ చౌరస్తా, పెద్దమ్మ ఆలయం వద్ద బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన కొద్ది రోజులకే వాటిని భారీ వాహనాలు ఢీకొట్టడంతో అవి కూలిపోయింది.

హక్కులపై అవగాహన కలిగిఉండాలి



కొత్తపల్లిలో మాట్లాడుతున్న భావ్‌సింగ్

కాజీపేట అర్బన్: ప్రతీ పౌరుడు రాజ్యాంగ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కాజీపేట తహసీల్దార్ భావ్‌సింగ్ తెలిపారు. కాజీపేట మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాన్ని పెంపొందించేందుకు పౌర హక్కులు తోడ్పడుతాయని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఎంఈఓ మనోజ్‌కుమార్, ఎస్సై రాజ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హెల్త్ సూపరింటెండెంట్, ఏఈఓ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: మాట్లాడుతున్న రాజేందర్

రాజ్యాంగంపై అవగాహన అవసరం

హసన్‌పర్తి: భారత రాజ్యాంగంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాజేందర్ సూచించారు. మడిపల్లిలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చల్లా ప్రసాద్ మాట్లాడుతూ కాలనీల్లోని సమస్యలను దళితులు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫాజిల్, మాజీ సర్పంచ్ కాందారి భాగ్యలక్ష్మి, చిర్ర సుమలత, రవీందర్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ బీమా ఏజెంట్ల సమస్యలపై చర్చించాలి



హన్మకొండ: తమ సమస్యలపై పార్లమెంట్‌లో చర్చించాలని ఎల్ఐసీ ఏజెంట్లు కోరారు. హనుమకొండ కనకదుర్గ కాలనీలోని స్వగృహంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను ఎల్ఐసీ ఏజెంట్లు సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య వరంగల్ డివిజన్ అధ్యక్షుడు పులి సుధాకర్, సమాఖ్య నాయకులు వైవీ.కృష్ణారావు, శాగి వెంకటేశ్వర్‌రావు, పాలకుర్తి శ్రీనివాస్, చందా విద్యాసాగర్, రాజ శ్రీనివాస్, తండ అశోక్, వాసిరెడ్డి అప్పారావు, కుమారస్వామి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హసన్‌పర్తి: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



శకుంతలను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థినులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో 1974 – 75లో ఎస్సెస్సీ చదివిన పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ సంబురాలను హసన్‌పర్తి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పరస్పరం ఆప్యాయంగా పలకరిస్తూ గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. ప్రతీ ఏడాది ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవాలని నిర్ణయించారు. నాటి గురువులు ఈ.నరసింహారెడ్డి, నర్సింహాచార్యులు, ఎస్.నరసింహారెడ్డి, సీహెచ్.రుద్రయ్యను సన్మానించారు. పూర్వ విద్యార్థులు సుధాకర్ స్వామి, డాక్టర్ రాజ్‌మహ్మద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినుల సమ్మేళనం

కాజీపేట రూరల్: కాజీపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1989 – 1990లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థినుల సమ్మేళనం పట్టణంలో సోమవారం జరిగింది. పూర్వ విద్యార్థినులు ఒక చోట చేరి అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులను సన్మానించారు.

పూర్వ విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ పాఠశాల పూర్వ విద్యార్థికి ఆయా ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఆర్థిక సాయం అందజేశారు. పూర్వ విద్యార్థి గుగులోతు సేవికకు కలకత్తాలోని ఈఎస్ఐ మెడికల్ కళాశాలలో సీటు వచ్చింది. ఇటీవల ఆమె తండ్రి మృతిచెందారు. ఈక్రమంలో కళాశాల ఫీజు చెల్లించేందుకు ఆమె పడుతున్న ఆర్థిక ఇబ్బందులను తెలుసుకుని పాఠశాల హెచ్ఎం జీవీ.రామారావు ప్రోత్సాహంతో పలువురు ఉపాధ్యాయులు రూ.26 వేలను సేవికకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వాసు, మధుసూదన్, రాజిరెడ్డి, నర్సయ్య, వేణుగోపాల్, రమాదేవి, సమ్మిరెడ్డి, రజిత, పద్మ, మనోహర్, స్వామి, కాంతయ్య, లింగమూర్తి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ స్కాలర్‌షిప్‌ల అందజేత



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులు

కాజీపేట రూరల్: కాజీపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులకు ప్రతిభ స్కాలర్‌షిప్‌లను సోమవారం అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్ అధ్యక్షతన ఉల్లాస్ (యూఎల్ఎల్ఏఎస్) ట్రస్ట్ ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.వేయి చొప్పున 10 మందికి నగదు బహుమతి అందజేసినట్లు ఉల్లాస్ ట్రస్ట్ వరంగల్ కోఆర్డినేటర్ కె.నరేందర్ వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, విద్యావతి, శైలజ, అనిత, సతీష్‌కుమార్, శ్రీలత, జీ.సునీత, జ్యోతిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



మడికొండ: నగదు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

మడికొండ: చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతి అందజేసినట్లు ఉల్లాస్ ట్రస్ట్ సభ్యులు తెలిపారు. మడికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 20మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున సోమవారం అందజేసినట్లు వివరించారు. నాలుగేళ్లుగా ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు నగదు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులకు హెడ్‌మాస్టర్ సంధ్యారాణి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు అధిక ప్రాధాన్యం



హన్మకొండ అర్బన్: దేశాన్ని రక్షించే సైనికులకు ఎంత ప్రాధాన్యం ఉందో అన్నం పెట్టే అన్నదాతలకు కూడా సమాజంలో అంతే ప్రాధాన్యం ఉందని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ విజయచందర్ రెడ్డి అన్నారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని రెడ్ క్రాస్‌లోని రక్తదాన కేంద్రంలో యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా బాధిత పిల్లల కోసం సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.

పదోసారి రక్తదానం చేసిన ఈవీ.సాత్విక

రెడ్ క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్ కుమార్తె రెడ్ క్రాస్ యూత్ వలంటీర్ ఈవీ.సాత్విక తన పుట్టినరోజును పురస్కరించుకొని తలసేమియా బాధిత పిల్లల కోసం సుబేదారిలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలోని రక్తనిధి కేంద్రంలో పదోసారి రక్తదానం చేశారు.

ఒలింపియాడ్‌లో రామన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

హన్మకొండ: రామానుజన్ గణిత ఒలింపియాడ్‌లో హనుమకొండలోని రామన్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. మూడో తరగతి విద్యార్థి ఎం.విభాస్ కశ్యప్ ప్రథమ బహుమతి, 9వ తరగతి విద్యార్థిని టి.యుక్తశ్రీ ద్వితీయ బహుమతి సాధించినట్లు వివరించారు. ఈమేరకు పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ రాజేష్‌కుమార్, డైరెక్టర్ పురుషోత్తం, ప్రిన్సిపాళ్లు స్రవంతి, రజిత అభినందించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని వారు సూచించారు.

షైన్ హైస్కూల్‌లో మాక్ ఎలక్షన్



ఓటుహక్కు వినియోగించుకున్న మూగల కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు

హన్మకొండ: హనుమకొండ రాంనగర్‌లోని షైన్ హైస్కూల్‌లో సోమవారం మాక్ ఎలక్షన్ నిర్వహించారు. విద్యార్థులు డెమోక్రటిక్, సోషలిస్ట్, రిపబ్లిక్ పార్టీల వారీగా విడిపోయి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నికల తీరు, ఓటు హక్కు ప్రాధాన్యం, ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు ఈ నమూనా ఎన్నికలు నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రమ, ప్రిన్సిపాల్ ప్రగతిరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఫిబ్రవరి 3న మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరగనున్న వేయి గొంతులు.. లక్ష డప్పుల మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నాయకుడు మంద కుమార్‌మాదిగ పిలుపునిచ్చారు. వడ్డెపల్లి రోడ్డులో పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకుల సమావేశం సోమవారం జరిగింది. సూరన్న, దయాకర్, వీరన్న, మల్లేష్, సుకుమార్, మహేందర్, బుచ్చన్న, శివ, అనిల్, బండారు సురేందర్, ప్రణయ్‌దీప్, చాగంటి రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

పెన్షనర్ల సమస్యలు వెంటనే పరిష్కారం



హన్మకొండ: పెన్షనర్ల సమస్యలు వెనువెంటనే పరిష్కరిస్తున్నట్లు ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. హనుమకొండలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డేను సోమవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. అసోసియేషన్ 2025వ సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను అతిథులు ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ తూపురాణి సీతారాం, నాయకులు జన్నపురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామ నర్సింహాచారి, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్లు అన్వర్ హుస్సేన్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బ్రహ్మయ్య, వీరన్న, విద్యాదేవి, రహీం, సదానంద్, రాజేందర్, నర్సింహారెడ్డి, జ్యోతిరాణి పాల్గొన్నారు.

కేయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ ఎన్నిక

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ నాన్‌టీచింగ్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఎ.నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎస్ఆర్.మూర్తి, ప్రకాశం, ఎ.నర్సింహామూర్తి, జనరల్ సెక్రటరీగా డాక్టర్ ఎన్.సంజీవరావు, ఆర్గనైజేషన్ జాయింట్ సెక్రటరీలుగా వి.కృష్ణమాచార్య, పి.మల్లయ్య, ప్రభాకర్, వెంకట్రాం నర్సయ్య, ఎండీ.అక్తర్, జాయింట్ సెక్రటరీగా (రిక్రియేషన్) ఎస్.గిడియన్, కోశాధికారిగా చంద్రమౌళి, మహిళా రిప్రజెంటేటివ్‌గా సుగుణను ఎన్నుకున్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

వరంగల్ చౌరస్తా: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌పై అవహేళనగా మాట్లాడి బహుజన సమాజాన్ని అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని ఎంసీపీఐ(యూ) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో అమిత్ షా చిత్రపటాలను సోమవారం దహనం చేశారు. పార్టీ నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, నాయకులు ఎగ్గెని మల్లికార్జున్, ఐతం నాగేష్, అప్పనపురి నర్సయ్య, నలవెల రవి, రాయినేని ఐలయ్య, జటబోయిన నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ: హోం మంత్రి అమిత్ షాను పార్లమెంట్ నుంచి బహిష్కరించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి, సీపీఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి నున్నా అప్పారావు, ఎంసీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నీలం రవి మాట్లాడుతూ 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న వేళ రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా మాట్లాడడం దారుణమన్నారు. ఆయా పార్టీల నాయకులు ఎం.చుక్కయ్య, రావుల రమేష్, రాజిరెడ్డి, వెంకట్, వీరన్న, తిరుపతి, కె.లింగయ్య, శంకర్, భానునాయక్, ఎంఎస్‌రావు, సాంబయ్య, రమ, కిషోర్, జంపాల రమేష్, కుమారస్వామి, రాధిక, శ్వేత, సుదర్శన్, రమేష్ పాల్గొన్నారు.

రైల్వే ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఆస్పత్రిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పారామెడికల్ స్టాఫ్‌ను భర్తీ చేయాలని, రైల్వే క్యాంటీన్ ఏర్పాటు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ పి.రవీందర్ కోరారు. ఈమేరకు సికింద్రాబాద్ డివిజన్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) డాక్టర్ నారాయణస్వామిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు.

వైభవంగా అయ్యప్ప శోభాయాత్ర

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు బత్తిని సతీష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వేదపండితుడు శ్రీరాంశర్మ నేతృత్వంలో ప్రత్యేక రథంపై అయ్యప్పస్వామిని ఉంచి సోమవారం వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో రామారావు, కృష్ణారావు, మల్లయ్య, పూజారి భాస్కర్ గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

దేవాలయ భూములను రక్షించాలి

నయీంనగర్: డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, రీచార్జ్ పాయింట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాల పేరుతో ప్రభుత్వం దేవాలయ భూములను కబ్జా చేసి అమ్ముకోవాలని చూస్తోందని రాష్ట్రీయ హిందూ పరిషత్ దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చీకటి రాజు వాపోయారు. ఈమేరకు దేవాలయ భూములను రక్షించాలని కోరుతూ రాష్ట్ర గవర్నర్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల ధర్నా

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లతోపాటు కాకతీయ యూనివర్సిటీలోని పలువురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వద్ద నిర్వహించిన ధర్నాలో సోమవారం పాల్గొన్నారు. మహాధర్నాలో కేయూ నుంచి పలు విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు కనకయ్య, సాదు రాజేష్, సత్య జూల, రాజేశ్వరి, శ్రీదేవి, వెంకటేష్, గోపి, స్వామి, సునీత, సతీష్, విజయ్ పాల్గొన్నారు.

25వ రోజుకు సమగ్రశిక్ష ఉద్యోగుల సమ్మె

విద్యారణ్యపురి: తమకు పేస్కేల్ వర్తింపజేయాలని, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం 25వ రోజుకు చేరుకుంది.

పెండింగ్‌లోని జీతాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

హన్మకొండ అర్బన్: కాకతీయ మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న హాస్టల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, శానిటేషన్ కార్మికులకు గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ ప్రావీణ్యకు అందజేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ 22 ఏళ్లుగా కేఎంసీ హాస్టళ్లలో సెక్యూరిటీ, శానిటేషన్ విభాగాల్లో 80 మంది సిబ్బంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో వారికి విద్యార్థుల నుంచి వసూలు చేసిన డబ్బుల నుంచి జీతాలు ఇచ్చేవారని పేర్కొన్నారు. గత మార్చి నుంచి ప్రభుత్వ బడ్జెట్ నుంచి జీతాలు వస్తాయని చెప్పి నాలుగు నెలల పాటు సాయి సెక్యూరిటీ సర్వీస్ ద్వారా జీతాలు అందించి, ఆ తర్వాత ఆరు నెలలుగా చెల్లించలేదని వాపోయారు. కార్యక్రమంలో కేఎంసీ కార్మికులు అల్లం రమేష్, ప్రశాంత్, శశిధర్, కిషన్, రమేష్, కిషోర్, పరమేశ్, రత్నాకర్, రాజకుమారి, కవిత, రాణి, కోమల, నజియా పాల్గొన్నారు.

రాష్ట్రంలో గందరగోళంగా విద్యావ్యవస్థ



సమావేశంలో మాట్లాడుతున్న నాగార్జున

- ఏఐఎఫ్‌డీఎస్ ప్రధాన కార్యదర్శి నాగార్జున

హన్మకొండ: రాష్ట్రంలో విద్యావ్యవస్థ గందరగోళంగా తయారైందని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున విమర్శించారు. హనుమకొండ నక్కలగుట్టలో ఏఐడీఎఫ్‌డీఎస్ హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తే, తాము అధికారంలోకి వస్తే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు దృష్టి సారించడం లేదని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించడం లేదని వాపోయారు. సమావేశంలో ఏఐఎఫ్‌డీఎస్ బాలికల కన్వీనర్ మాస్ సావిత్రి, జిల్లా అధ్యక్షుడు దామెరకొండ నాగరాజు, నాయకులు కొండ ప్రణయ్, మల్లం ఆశిష్, వినోద్ పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న నాయకులు, గుడిసెవాసులు

ఖిలా వరంగల్: దశాబ్ద కాలంగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న నిరుపేదలకు పట్టాలు అందజేసి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ సభ్యురాలు నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. ఈమేరకు ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ మండల కమిటీ సభ్యుడు ధర్మారపు సాంబమూర్తి ఆధ్వర్యంలో కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా రత్నమాల మాట్లాడుతూ మండల పరిధిలో సుమారు 6వేల మంది గుడిసెవాసులు ఉన్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు అందజేసి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో చుక్క ప్రశాంత్, ఉదయ్, భవాని, మల్లన్న, సమీనా, ప్రకాశ్, భాగ్యశ్రీ, ప్రభాకర్, కవిత, అబ్బాస్, స్వరూప, శంకర్, వేణు, మంజుల పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కటకటాలే



తనిఖీలు చేస్తున్న ఏసీపీ నందిరాం నాయక్

ఖిలా వరంగల్: నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, శ్రుతిమించినా, నిబంధనలు అతిక్రమించినా కటకటాల పాలుకాక తప్పదని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరామ్‌నాయక్ హెచ్చరించారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డు ఇసుక అడ్డా జంక్షన్‌లో మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ డిసెంబర్ 31న రహదారులపై విస్తృత తనిఖీలు చేపడుతామని అన్నారు. బార్ అండ్ రెస్టారెంట్లు నిర్ణీత సమయంలోపు మూసివేయాలని సూచించారు. ఇబ్బందులు ఎదురైతే ప్రజలు 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్సైలు శ్రీకాంత్, సురేష్, రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భద్రత.. పోలీసుల బాధ్యత



మొక్క నాటిన ఏసీపీ తిరుమల్, తదితరులు

హసన్‌పర్తి: ప్రజల భద్రత పోలీసుల బాధ్యత అని కాజీపేట ఏసీపీ తిరుమల్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరాతీశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లపై పోలీసులు నిఘా పెట్టాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సై రవి, సిబ్బంది పాల్గొన్నారు.